
సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం । 9 । మే । 2023



కోళ్ల ఎరువు.. పోషకాల నెలవు
సేంద్రియ ఎరువుల వాడకంతో ఉద్యాన పంటల్లో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.
8లో



ఏసీబీ వలలో..
అవినీతి నిరోధక శాఖ అధికారుల వలలో ఏలూరు ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ చిక్కారు. లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు.
8లో



బెట్టింగ్ నిర్వాహకుల అరెస్టు
ఏలూరు టూటౌన్ పరిధిలో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు.
8లో

న్యూస్‌రీల్


క్రమశిక్షణ చర్యలను నమోదు చేయాలి



మాట్లాడుతున్న ఖజానా అధికారి గణేష్

భీమవరం(ప్రకాశం చౌక్) : జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగుల మాస్టర్ డేటాలో వారిపై ఉన్న క్రమశిక్షణ చర్యలు విధిగా నమోదు చేయాలని జిల్లా ఖజానా శాఖ అధికారి ఎ.గణేష్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో క్రమశిక్షణ చర్యలకు సంబంధించిన డేటా నమోదుపై అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులపై పెండింగ్‌లో ఉన్న క్రమశిక్షణ చర్యల సత్వర పరిష్కారానికి ప్రభుత్వం డేటాబేస్ ఏర్పాటుచేయాలని నిర్ణయించిందన్నారు. ఈనెల 12లోపు హెర్బ్ పేరోల్ ప్యాకేజీలో ప్రతి డీడీఓ తప్పనిసరిగా పొందుపరచి, డీడీఓలు పంపిన డేటాను ఖజానా అధికారులు నిర్ధారించాల్సి ఉందన్నారు. దీనిపై డీడీఓలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలు నిబంధనలు పాటించాలి



అధికారులతో సమీక్షిస్తున్న ఏలూరు డీఆర్వో

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలోని ప్రైవేట్ అన్ఎయిడెడ్ జూనియర్ కళాశాలలకు 2023–24కి గాను గుర్తింపు పునరుద్ధరణ కోసం కమిటీ సభ్యులతో జిల్లా రెవెన్యూ అధికారి ఏవీఎస్ఎన్ మూర్తి అధ్యక్షతన స్థానిక డీఆర్వో కార్యాలయంలో సోమవారం సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ప్రైవేట్ జూనియర్ కళాశాలల నియమ నిబంధనలు, అనుమతి పత్రాల విషయంపై చర్చించారు. తనిఖీలు నిర్వహించిన అనంతరం గుర్తింపు రద్దయిన కళాశాలల్లో విద్యార్థులను ప్రత్యామ్నాయ కళాశాలల్లో సర్దుబాటు చేసే విధివిధానాలపై చర్చించారు. తనిఖీలు పూర్తయిన తర్వాత ఇంటర్మీడియట్ విద్యా మండలికి ప్రతిపాదనలు సమర్పించాలని నిర్ణయించారు. ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖర బాబు, అడిషనల్ మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, జిల్లా అగ్నిమాపక అధికారి డి.మాల్యాద్రి, అడిషనల్ ఎస్పీ ఎస్ఎస్ఎస్ శేఖర్ పాల్గొన్నారు.

రీ కౌంటింగ్‌కు 13 వరకు గడువు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పదో తరగతి పరీక్షల రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు ఈనెల 13వ తేదీ లోపు దరఖాస్తులను జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సమర్పించాలని డీఈఓ ఎస్వీ రవిసాగర్ స్పష్టం చేశారు. సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో, సీఎఫ్ఎంఎస్‌లో చెల్లించిన ఫీజుకు సంబంధించిన చలానాతో సహా దరఖాస్తులు సమర్పించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. నిర్దేశిత తేదీలోపు రుసుం చెల్లించకపోతే 13వ తేదీ అనంతరం ఎట్టి పరిస్థితిలోనూ దరఖాస్తు స్వీకరించరని తెలిపారు.

మేనరికపు వివాహాలతో తలసేమియా ప్రమాదం

ఏలూరు రూరల్: తలసేమియా వ్యాధిపై ప్రతి ఒక్కరిలో అవగాహన పెరగాలని దివ్యాంగుల పునరావాస కేంద్రం సంస్థ కో– ఆర్డినేటర్ డి.శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం ప్రపంచ తలసేమియా దినోత్సవం సందర్భంగా కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మేనరికపు పెళ్లిళ్ల కారణంగా పుట్టబోయే పిల్లలు తలసేమియా వ్యాధి బారిన పడే అవకాశం ఉందన్నారు. తలసేమియా అధిక శాతం రక్తంపై ప్రభావం చూపుతుందన్నారు. శరీరానికి కావల్సిన హిమోగ్లోబిన్ ఉత్పత్తి తగ్గిపోవడం మరో లక్షణం అన్నారు. వ్యాధిపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. పీఓ రాజ్‌కుమార్, ఫిజియోథెరపిస్ట్ జి.రాంబాబు, కె.నాగరాజు, పి.జయలక్ష్మి పాల్గొన్నారు.

అప్రెంటిస్‌కి 89 మందికి అర్హత

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఐటీఐ ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఏలూరు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో సోమవారం నిర్వహించిన ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళాలో 89 మంది విద్యార్థులు అర్హత సాధించారని ఏలూరు ఐటీఐ ప్రధానాధికారి పి.రజిత తెలిపారు. జ్యూట్‌మిల్ కృష్ణ హెస్సియన్స్, నాయుడుపేట శ్రీ సిటీ, విజయవాడ నవత రోడ్ ట్రాన్స్‌పోర్టు, నూజివీడు మోహన్ స్పిన్‌టెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్ రాణే ఇంజిన్ వాల్స్ నాగ హనుమాన్ సాల్వెంట్ ఆయిల్స్ తదితర 18 సంస్థల ప్రతినిధులు మేళాలో పాల్గొన్నాయన్నారు. 121 మంది విద్యార్థులు హాజరు కాగా 89 మందిని వివిధ సంస్థలు ఎంపికచేసుకున్నాయన్నారు. సెట్‌వెల్ ప్రతినిధి పీవీఎస్ సత్యనారాయణ, ఉపాధి కార్యాలయం ప్రతినిధి పాల్గొన్నారు.

పర్యాటకం.. ప్రగతి పథం

- రూ.1.50 కోట్లతో ప్రతిపాదిత పనులు
- రిసార్టులకు గోదావరి పరీవాహక ప్రాంతాల్లో స్థల సేకరణ
- రూ.30 లక్షలతో కొల్లేరు టూరిజం అభివృద్ధి
- పేరుపాలెం బీచ్‌లో అదనపు వసతుల కల్పన





ఆచంట నియోజకవర్గం పెదమల్లం వద్ద రిసార్టు స్థలాన్ని పరిశీలిస్తున్న పర్యాటకశాఖ అధికారి, పోలవరంలో రిసార్టుల స్థలాన్ని పరిశీలిస్తున్న పర్యాటక సిబ్బంది

సాక్షి ప్రతినిధి, ఏలూరు: పర్యాటక రంగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ప్రకృతి అందాలకు చిరునామాగా నిలిచే ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీటీడీసీ) రూ.1.50 కోట్లతో అభివృద్ధి పనులను శరవేగంగా చేపడుతోంది. వేసవి సెలవుల నేపథ్యంలో పర్యాటక ప్రాంతాలను సందర్శించే యాత్రికుల సంఖ్యకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యంగా సందర్శనార్థం విచ్చేసే విద్యార్థులకు రాయితీలు కల్పిస్తున్నారు. పేరుపాలెం బీచ్‌లో రిసార్టులు నిర్మించడానికి ఈ ఏడాది మార్చిలో విశాఖలో జరిగిన జీ–20 అంతర్జాతీయ సదస్సులో రెండు ఎంఓయూలు జరిగాయి.

అభివృద్ధి పనులు

రాష్ట్ర పర్యాటకశాఖ ఆధ్వర్యంలో యాత్రికులను ఆకర్షించడానికి పర్యాటక ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టింది. పాపికొండలు సమీప కొరుటూరు వద్ద రూ.45 లక్షలతో విశ్రాంతి గదులు, జల్లేరు జలాశయం వద్ద రూ.20 లక్షలతో రిసార్ట్‌లు, గుంటుపల్లి గుహల వద్ద రూ.25 లక్షలతో టూరిస్ట్ ఇన్ఫర్మేషన్ సెంటర్, అదనపు గదులు, పేరుపాలెం బీచ్ వద్ద రూ.30 లక్షలతో యాత్రికుల కోసం మరుగుదొడ్లు, సేద తీరే బెంచీల ఏర్పాటు శరవేగంగా జరుగుతోంది. ముఖ్యంగా కొల్లేరు పర్యావరణానికి రూ.30 లక్షలు కేటాయించారు. ఈ నిధులతో కైకలూరు, ఏలూరు ప్రాంతాల్లోని ఆటపాక, మాధవాపురం పక్షుల ఆవాస కేంద్రాల వద్ద మౌలిక సౌకర్యాలను కల్పించనున్నారు.

యూత్ క్లబ్‌లకు రాయితీలు

వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవడానికి పర్యాటక ప్రాంతాలను సందర్శించే యూత్ క్లబ్‌కు రాయితీలను ఏపీటీడీసీ కల్పిస్తోంది. యువతీ, యువకులు 18 ఏళ్లు పైబడి దాదాపు 30 మంది క్లబ్‌గా ఏర్పడి విచ్చేసే వారు గదులు, సందర్శనలో రాయితీలు అందుకుంటారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో హరిత, కొరుటూరు, శివరన్, సన్‌రైజ్ రిసార్టులు, పేరుపాలెం, హంస బీచ్ రిసార్టులు అందుబాటులో ఉన్నాయి. గుంటుపల్లి గుహలతో పాటు ఆహ్లాదాన్ని పంచే గోదావరి విహారి సిద్ధంగా ఉంది. వీటితో పాటు ద్వారకాతిరుమల, భీమవరం సోమేశ్వరాలయం, మావుళ్లమ్మ, మద్ది ఆంజనేయ, క్షీరారామలింగేశ్వర ఆలయాలను సందర్శించవచ్చు.

గోదావరి చెంత విహార కేంద్రాలు

గోదావరి పరీవాహక ప్రాంతాల్లో పర్యాటకాన్ని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం నూతన ప్రణాళికను రూపొందిస్తోంది. గోదావరి నది సమీప యలమల కుదురులంక, నరసాపురం, ఆచంట ప్రాంతాల్లో ఒక్కోచోట దాదాపు 10 ఎకరాల భూమిని సేకరించాలని ప్రభుత్వం నుంచి కలెక్టర్‌కు ఆదేశాలు అందాయి. గోదావరి చెంత పర్యాటకులు విహరించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయనున్నారు. అలాగే మొగల్తూరు హైవే సమీపంలోని మూడు ఎకరాల్లో రిసార్ట్‌లు, టూరిస్ట్ ఇన్ఫర్మేషన్ సెంటర్లను నిర్మించనున్నారు.

పర్యాటకులకు అన్ని వసతులు



యూత్ క్లబ్‌లకు పర్యాటక ప్రాంతాల్లో రాయితీలు కల్పిస్తున్నాం. ఇప్పటికే పేరుపాలెం బీచ్ వద్ద రూ.1.50 కోట్లతో పలు పనులు జరిగాయి. విశాఖలో జరిగిన జీ–20 అంతర్జాతీయ సదస్సులో రెండు ఎంఓయూలు పేరుపాలెంలో మరిన్ని రిసార్టుల నిర్మాణానికి ఒప్పందం చేసుకున్నాయి. పర్యాటకులకు అన్ని వసతులను కల్పిస్తున్నాం. త్వరలో గోదావరి నదీ పరీవాహక ప్రాంతాల్లో స్థలాలను సేకరించి రిసార్టులను ఏర్పాటు చేసే ప్రణాళికను రూపొందిస్తున్నారు.

– ఎండీహెచ్ మెహరాజ్, పర్యాటకశాఖ అధికారి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా

చంద్రబాబును వెలివేయాలి

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



తాడేపల్లిగూడెం రూరల్: ప్రజలు, రైతులు బాగుంటే చూడలేని వ్యక్తి చంద్రబాబు అని, ఆయన్ను రాష్ట్రం నుంచి వెలివేయాలని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. మండలంలోని ఆరుగొలనులో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రజలు సుఖంగా ఉంటే తన ముఖం చూడరని భావించే వ్యక్తి చంద్రబాబు అని విమర్శించారు. చంద్రబాబు అసలు మన రాష్ట్రంతో సంబంధం లేని వ్యక్తి అని, సాయంత్రానికి హైదరాబాద్ చేరుకుంటాడని చెప్పారు. దుర్మార్గపు చంద్రబాబును రాష్ట్ర రాజకీయాల నుంచి దూరంగా ఉంచాలన్నారు. ఆయనతో జతకట్టిన, జతకట్టాలనుకున్నవారిని అనుమానించాల్సిన పరిస్థితి ఉందన్నారు. దాళ్వా సీజన్ పంట చేతికొచ్చిన తరుణంలో అకాల వర్షాలతో రైతులు నష్టపోయి ఉంటే వారిని ఆదుకునే దిశగా సీఎం జగన్ చర్యలు తీసుకుంటున్నారన్నారు. తడిసిన, మొక్క వచ్చిన ధాన్యాన్ని సైతం మిల్లులకు తరలించాలని సీఎం ఆదేశించారన్నారు. రైతులకు న్యాయం చేసే దిశగా జగన్ ముందుకెళ్తున్నారన్నారు. అకాల వర్షాన్ని అడ్డం పెట్టుకుని పోటుగాడిలా చంద్రబాబు బయల్దేరాడని మండిపడ్డారు. 14 ఏళ్ల టీడీపీ పాలనలో ఏనాడైనా రైతులకు సకాలంలో ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా ఇచ్చిన దాఖలాలు ఉన్నాయా అని ప్రశ్నించారు. వ్యవసాయం దండగ అన్న వ్యక్తి చంద్రబాబు అని విమర్శించారు. చంద్రబాబు వైఖరిని చూసి రైతులు అసహ్యించుకునే పరిస్థితి ఉందన్నారు. రైతులను పరామర్శించడానికి వచ్చిన సందర్భంలో ఎవరైనా రైతులు నిలదీస్తే వారిని కులం పేరుతో పక్కన పెట్టే పరిస్థితి నెలకొందన్నారు.

రైతు పక్షపాతి వైఎస్సార్ కుటుంబం

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



తణుకు అర్బన్ : 'ఉచిత విద్యుత్ అంటే తీగలపై బట్టలు ఆరేసుకోవాలని.. వ్యవసాయం దండగని.. కాల్దరిలో రైతులపై కాల్పులు జరిపించి ప్రాణాలు తీసిన మీరా రైతుల మేలు కోరేది' అని చంద్రబాబు తీరుపై రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు విమర్శించారు. తణుకు మునిసిపల్ కార్యాలయంలో సోమవారం మంత్రి కారుమూరి విలేకరులతో మాట్లాడుతూ అకాల వర్షాలతో తడిసిన ధాన్యం సైతం కోసినది కోసినట్టే మిల్లులకు పంపించి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీరును ప్రశంసించాల్సిందిపోయి వ్యతిరేకంగా పోరుబాట పడతామని పిలుపునిస్తారా అని చంద్రబాబును నిలదీశారు. జిల్లాలో 12 వేల ఎకరాల్లో జయ బొండాలు రైతులు పండించారని వాటిని ఏలూరులోని బాయిల్డ్ రైస్ మిల్లులకు పంపిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు రూ.1,393 కోట్ల విలువైన ధాన్యాన్ని ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేయగా, రూ.827 కోట్లు రైతుల ఖాతాల్లో జమచేశామన్నారు. రైతు పక్షపాతిగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి కుటుంబం సేవలందిస్తుండగా, రైతు వ్యతిరేకిగా చంద్రబాబు నిలిచారని అన్నారు. రైతులను ఇబ్బందులకు గురిచేసిన విషయాలను ప్రభుత్వం కఠినంగా పరిశీలిస్తుందని ఇప్పటివరకు రాష్ట్రంలో 39 రైసుమిల్లులపైనా, 33 మంది ఉద్యోగులపైనా ప్రభుత్వం చర్యలు తీసుకుందని స్పష్టం చేశారు.

మూర్ఖుడు పట్టాభి

టీడీపీ నాయకుడు పట్టాభి మూర్ఖత్వంగా మాట్లాడుతున్నాడని మంత్రి కారుమూరి విమర్శించారు. ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్‌ను చదివే దుర్మార్గుడు పట్టాభి అన్నారు. తణుకు టీడీపీ నేత దగాకోరు రాజకీయానికి తెరతీశారని తణుకు నియోజకవర్గ ప్రజానీకం గమనిస్తున్నారన్నారు. తన అనుయాయుల ద్వారా కట్ అండ్ పేస్ట్ వీడియోలు తయారుచేసి సోషల్ మీడియాలో వదలడంలో నేర్పరిగా మారాడని విమర్శించారు. ఇరగవరంలో ఇళ్ల స్థలాల కోసం ధర్నా చేసిన మహిళలను నెట్టి వేసిన ఘనత, అలాగే కేసు విషయంలో తనకు అనుకూలంగా చేయలేదని ఎస్సైని నేలపై కూర్చోపెట్టిన చరిత్ర అతనిదని మంత్రి కారుమూరి మండిపడ్డారు.

బాధ్యతతో స్పందన అర్జీల పరిష్కారం




స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

భీమవరం(ప్రకాశం చౌక్): స్పందనలో వచ్చిన ప్రతి దరఖాస్తును బాధ్యతతో పరిశీలించి అర్జీదారులకు పరిష్కారం చూపాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి ఆమె అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్పందన అర్జీలు రీ ఓపెన్ కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఒకే సమస్యపై రెండోసారి స్పందనలో ఫిర్యాదు రాకుండా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. స్పందన కార్యక్రమంలో 207 అర్జీలు వచ్చాయని, వాటన్నింటినీ సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ డి.అఖిల, డీఎల్‌పీఓ ఎం.నాగలత, డీఎల్‌డీఓ కేసీహెచ్ అప్పారావు, భీమవరం డీఎస్పీ బి.శ్రీనాథ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని..

- గొల్లలకోడేరు సంజన అపార్ట్‌మెంట్స్‌లో 40 అడుగుల రోడ్లు దాటుకుని పంచాయతీ అనుమతితో మొక్కలు నాటగా అపార్ట్‌మెంట్ డెవలపర్, అతడి అనుచరులు వచ్చి మొక్కలు కొట్టివేశారని డీఎల్‌కే రాజు, అపార్ట్‌మెంట్లు వాసులతో కలిసి ఫిర్యాదు చేశారు.
- భీమవరం ఎల్ఐసీ కార్యాలయం సమీపన ఓవర్ బ్రిడ్జిపైకి వెళ్లే మెట్ల మార్గం వద్ద చికెన్, మటన్ వ్యర్థాల మూటలు పడవేస్తున్నారని, దీంతో ఇబ్బంది పడుతున్నామని మాదాసు పార్థసారథి అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు.
- గణపవరంలో ఎస్టీలకు చెందిన 11 కుటుంబాలకు సంబంధించి ఇళ్లపట్టాలు ఇచ్చికూడా స్థలాలు కేటాయించ లేదని, దీంతో ఇబ్బంది పడుతున్నామని డీఆర్వో దృష్టికి తీసుకువచ్చారు.

తాడేపల్లిగూడెం ఇక రెవెన్యూ డివిజన్



తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం పట్టణం ఇక కొత్త రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటైంది. డిప్యూటీ సీఎం, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ కృషితో పట్టణానికి డీఎస్పీ కార్యాలయం, రెవెన్యూ డివిజన్‌లు వచ్చాయి. రెవెన్యూ డివిజన్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం సోమవారం జీఓఎంఎస్ నంబరు 204ను విడుదల చేసింది. రెవెన్యూ డిపార్టుమెంటు నుంచి ఈ మేరకు ఉత్తర్వులు వచ్చాయి. దీని ప్రకారం తాడేపల్లిగూడెం రెవెన్యూ డివిజన్ కింద తాడేపల్లిగూడెం, పెంటపాడు, తణుకు నియోజకవర్గంలోని నరసాపురం రెవెన్యూడివిజన్ పరిధిలో ఇప్పటివరకు ఉన్న అత్తిలి, తణుకు, ఇరగవరం మండలాలు తాడేపల్లిగూడెం రెవెన్యూ డివిజన్ కిందకు వస్తాయి. జిల్లా మూడు రెవెన్యూ డివిజన్‌లుగా మారింది. నరసాపురం డివిజన్ కింద నరసాపురం, మొగల్తూరు. పాలకొల్లు, పోడూరు, యలమంచిలి, ఆచంట, పెనుగొండ, పెనుమంట్ర ఉంటాయి. భీమవరం డివిజన్ కింద భీమవరం, వీరవాసరం, ఉండి, కాళ్ల, పాలకోడేరు, ఆకివీడు, గణపవరం మండలాలు ఉంటాయి. జిల్లా మూడు రెవెన్యూ డివిజన్‌లుగా మారగా నరసాపురం డివిజన్‌లో ఎనిమిది మండలాలు, భీమవరం డివిజన్‌లో ఏలూరు జిల్లా నుంచి వచ్చి చేరిన గణపవరం మండలంతో కలిపి ఏడు మండలాలు, తాడేపల్లిగూడెం డివిజన్‌లో ఐదు మండలాలు ఉంటాయి. తాడేపల్లిగూడెంలో రెవెన్యూ డివిజనల్ కార్యాలయాన్ని ఆర్ అండ్ బీ బంగ్లా వద్ద ఉన్న కార్యాలయంలో ఏర్పాటుచేయనున్నారని సమాచారం. డీఎస్పీ కార్యాలయం కూడా తాడేపల్లిగూడెంకు మంజూరు కాగా సాధారణ పోస్టింగ్‌లలో భాగంగా విజయవాడ అవినీతి నిరోధకశాఖలో పనిచేసే సి.శరత్‌రాజ్‌కుమార్‌ను ఇక్కడ డీఎస్పీగా నియమిస్తూ ఉత్తర్వులు వచ్చాయి. ఈ కార్యాలయం అగ్నిమాపకశాఖ నూతన భవనంలో ఏర్పడే అవకాశాలున్నాయి.

ఐదు మండలాలతో కొత్త డివిజన్ ఏర్పాటు

భీమవరం (ప్రకాశం చౌక్) : జిల్లాలో తాడేపల్లిగూడెం నూతన రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వం సోమవారం తుది ఉత్తర్వులు జారీ చేసిందని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఇప్పటివరకూ జిల్లాలో నరసాపురం, భీమవరం రెండు రెవెన్యూ డివిజన్లు ఉండగా మూడో రెవెన్యూ డివిజన్‌గా తాడేపల్లిగూడెం ఏర్పాటు చేశారన్నారు. తాడేపల్లిగూడెం డివిజన్‌లో తాడేపల్లిగూడెం, పెంటపాడు, అత్తిలి, తణుకు, ఇరగవరం మండలాలను చేర్చారన్నారు.

టీడీపీ నేత పట్టాభిపై కేసు నమోదు

తణుకు: తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి పట్టాభిరామ్‌పై తణుకు పట్టణ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావుపై పట్టాభిరామ్ అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ సోమవారం తణుకు వైఎస్సార్‌సీపీ నాయకులు పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పట్టాభిరామ్‌తోపాటు టీవీ5 జర్నలిస్టు మూర్తి, టీవీ5 యాజమాన్యంపై 153, 153 (ఎ), 505 (2), 504, 120 (బి) సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ ముత్యాల సత్యనారాయణ చెప్పారు.

రెడ్‌క్రాస్ సేవలు ఎనలేనివి

డీఆర్వో కృష్ణవేణి



రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు హెన్రీ డ్యునాంట్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఆర్వో, అధికారులు

భీమవరం(ప్రకాశం చౌక్): ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలని.. రక్తసంబంధీకులు కావాలనే నినాదంతో జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ ముందుకు సాగుతోందని జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి అన్నారు. సోమవారం ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు హెన్నీ డ్యునాంట్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ జిల్లాలో గతేడాది మే నెలలో రెడ్‌క్రాస్ ప్రారంభించారని, జిల్లాలో ఉత్తమ సేవలందించినందుకు కలెక్టరు పి.ప్రశాంతి గవర్నర్ చేతులమీదుగా పతకం అందుకున్నారన్నారు. రూ.1.80 కోట్లతో రాయలంలో బ్లడ్ బ్యాంకు ఏర్పాటుచేశామన్నారు. విపత్తుల సమయంలో నిత్యావసర వస్తువుల సరఫరా, రక్తదాన శిబిరాలు, నేత్రపరీక్షలు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు.

దివ్యాంగుల హక్కుల చట్టంపై..

దివ్యాంగుల హక్కుల చట్టం పటిష్ట అమలుకు అధికారులు కృషి చేయాలని డీఆర్వో కృష్ణవేణి అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి దివ్యాంగుల హక్కుల సమావేశాన్ని కమిటీ సభ్యులతో కలిసి నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ దివ్యాంగుల జీవన ప్రమాణాల మెరుగుదల, వారి హక్కుల పరిరక్షణ, మరిన్ని సదుపాయాలు కల్పనకు చట్టం పనిచేస్తుందన్నారు. దివ్యాంగుల సంక్షేమంపై పలు సూచనలు చేశారు. దివ్యాంగులకు సంబంధించిన కేసులను దివ్యాంగుల హక్కుల చట్టం ప్రకారం నమోదు చేయడం లేదని రాష్ట్ర దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు అల్లాడి నటరాజ్ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఎస్పీకి నివేదిస్తామని డీఆర్వో తెలిపారు. అందరూ దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. జిల్లా దివ్యాంగుల సంక్షేమ అధికారి జీవీవీ సత్యనారాయణ, డీఎంహెచ్ఓ డి.మహేశ్వరరావు, డీఈవో ఆర్‌వీ రమణ, డీఆర్‌డీఏ పీడీ ఎస్ఎస్ఎస్ వేణుగోపాల్, డీపీఓ ఎం.నాగలత తదితరులు పాల్గొన్నారు.

ఏలూరులో 'ఉమెన్ డ్రాప్ ఎట్ హోమ్'

ఏలూరు టౌన్: మహిళా భద్రతకు పెద్దపీట వేస్తూ ఏలూరులో ఉమెన్ డ్రాప్ ఎట్ హోమ్ అనే వినూత్న కార్యక్రమానికి జిల్లా ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి శ్రీకారం చుట్టారు. మహిళలకు రాత్రి 10 గంటల నుంచి వేకువజామున 5 గంటల వరకు ఈ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఆయా సమయాల్లో మహిళలు దూరప్రాంతాల నుంచి ఏలూరు వస్తే రవాణా సౌకర్యం లేకుంటే పోలీస్ కంట్రోల్‌రూమ్ 100 లేదా 112 లేదా 83329 59175కు ఫోన్ చేస్తే ఉమెన్ డ్రాప్ ఎట్ హోమ్ వాహనం మహిళా కానిస్టేబుల్‌తో వచ్చి వారిని గమ్యస్థానాలకు చేరుస్తుందని జిల్లా ఎస్పీ తెలిపారు. మహిళల రక్షణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు.

సత్వర పరిష్కారానికి చర్యలు



వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ రవిప్రకాష్

సాక్షి, భీమవరం : స్థానిక డీఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 15 మంది బాధితులు ఫిర్యాదులు అందజేసినట్టు ఎస్పీ యు.రవిప్రకాష్ తెలిపారు. ఆయా ఫిర్యాదులపై సత్వరమే విచారణ జరిపి సమస్యలను త్వరితగతిని పరిష్కరించాలని పోలీసు అధికారులను ఫోన్‌లో ఆదేశించారు. ఫిర్యాదుల్లో కొన్ని..

- యలమంచిలికి చెందిన వ్యక్తి తనను గ్రామం నుంచి వెలివేశారని, న్యాయం చేయాలని ఎస్పీని కోరాడు.
- ప్రేమ వివాహంలో తన మనవడు జోక్యం చేసుకున్నాడని కక్షతో కొందరు దాడి చేశారని పెనుమంట్రకు చెందిన ఓ మహిళ ఎస్పీ రవిప్రకాష్ దృష్టికి తీసుకువచ్చారు.
- తన కుమార్తె కనిపించడం లేదని ఏడాది క్రితం పాలకోడేరు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ఓ వ్యక్తి ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు.
- మొగల్తూరు మండలానికి చెందిన వ్యక్తి తన నుంచి 34 గొర్రెలను పనిచేసే వ్యక్తి మోసం చేసి తీసుకువెళ్లాడని, కేసు పెట్టినా మొగల్తూరు పోలీసులు చర్యలు తీసుకోలేదని ఫిర్యాదు చేశాడు.

కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న వాహనం సీజ్, ఇద్దరి అరెస్టు


వాహనం, నిందితులను పట్టుకున్న పోలీసులు

భీమడోలు: కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసి ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై చావా సురేష్‌కుమార్ చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆగడాలలంక గ్రామానికి చెందిన భలే లక్ష్మీ నారాయణ, సైదు ప్రసన్న కుమార్ గుంటూరులోని వివిధ చికెన్ దుకాణాల నుంచి వెయ్యి కిలోల కోళ్ల వ్యర్థాలను సేకరించి డ్రమ్ముల్లో నింపి వాటిని వాహనంలో కొల్లేరు గ్రామాల్లోని చేపల చెరువులకు మేత నిమిత్తం తరలిస్తుండగా గుండుగొలను శివారు ప్రాంతంలో సోమవారం తెల్లవారుజామున పోలీసులు పట్టుకున్నారు. లక్ష్మీనారాయణ, ప్రసన్నకుమార్‌లను అదుపులోకి తీసుకుని, సమీపంలో గొయ్యి తీసి కోళ్ల వ్యర్థాలను అందులో వేసి పూడ్చివేశారు. చెరువుల్లో చేపలకు కోళ్ల వ్యర్థాలను మేతగా వేయడం వల్ల ప్రజారోగ్యానికి విఘాతంతో పాటు పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని, అక్రమంగా కోళ్ల వ్యర్థాలను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

రేపు డీఎస్సీ-98 టీచర్స్ సమావేశం


తాడేపల్లిగూడెం (టీఓసీ): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా డీఎస్సీ-98 ఎంటీఎస్ టీచర్స్ సమావేశం బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు తాడేపల్లిగూడెంలోని కేఎన్‌రోడ్డు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు వై.సుబ్బారాయుడు, పి.బెనర్జీ, కె.మోహన్‌రావు, తమ్మ ప్రభాకర్ చెప్పారు. ఈ సమావేశంలో డీఎస్సీ-98 ఉపాధ్యాయుల సమస్యలు, భవిష్యత్తు కార్యాచరణపై చర్చిస్తారని వెల్లడించారు. ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులు హాజరుకావాలని కోరారు.

అధికారులపై దౌర్జన్యం చేసిన నలుగురిపై కేసు

యలమంచిలి: హైకోర్టు ఆదేశాలు అమలు చేయడానికి వెళ్లిన ప్రభుత్వ అధికారులపై దౌర్జన్యం చేసిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జాజుల విజయ్‌నాగప్రసాద్ చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. ఇలపకుర్రులో ప్రభుత్వ స్థలం సర్వే నంబర్ 258/21లో మూడు సెంట్ల స్థలం ఆక్రమించుకుని వాస్కూరి శ్రీనివాస్ ఇల్లు కట్టారు. దీనిని ఖాళీ చేయాలని పంచాయతీ అధికారులు 2020లో నోటీసు ఇచ్చారు. దీంతో అతను హైకోర్టుకు వెళ్లాడు. ఇంటిని ఖాళీ చేయించాలని హైకోర్టు తహసీల్దార్‌కు డైరెక్షన్ ఇచ్చింది. తహసీల్దార్ ఆదేశాల మేరకు ఇంటిని ఖాళీ చేయించడానికి వెళ్లిన వీఆర్వో ఆకుల వెంకన్న, గ్రామ కార్యదర్శి సీహెచ్ వెంకటరెడ్డిలపై శ్రీనివాస్, అతని కుటుంబ సభ్యులు రాజేశ్వరి, వెంకటరమణ, అవినాష్ దౌర్జన్యానికి దిగారు. దీనిపై వీఆర్వో, గ్రామ కార్యదర్శి ఫిర్యాదు మేరకు నిందితులపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కోళ్ల ఎరువు.. పోషకాల నెలవు

- పశువులు, కోళ్ల ఎరువుతో అధిక లాభాలు
- తక్కువ ధరలో లభించే సేంద్రియ ఎరువులు
- పంటలో మొక్కల ఎదుగుదలకు దోహదం




ఉద్యాన తోటలకు వేయడానికి పశువుల ఎరువును రైతులు ట్రాక్టర్‌కు ఎత్తుతున్న దృశ్యం

చింతలపూడి: అధిక దిగుబడులను ఆశించి రైతులు విచక్షణా రహితంగా రసాయన మందులు, పురుగుమందులు వాడటం వలన భూములు నిర్జీవంగా మారుతున్నాయి. బహుళ ప్రయోజనకారులైన సూక్ష్మజీవులు నశించడం వలన వాటి ద్వారా లభించే సేంద్రియ పదార్థాలు సూక్ష్మపోషక పదార్థాలు పూర్తిగా అదృశ్యమవుతున్నాయి. దీని వల్ల మొక్కల్లో పెరుగుదల నశిస్తుంది. ఉద్యాన పంటల్లో సమగ్ర పోషక యాజమాన్యాన్ని రైతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించే అవకాశాలు ఎక్కువ. ముఖ్యంగా ఉద్యాన పంటల్లో 50 శాతం సేంద్రియ ఎరువులు, 50 శాతం రసాయన ఎరువులు వాడినట్లయితే నాణ్యమైన దిగుబడులు పొందవచ్చునని ఉద్యాన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అడపా దుర్గేష్ రైతులకు సూచిస్తున్నారు.

సేంద్రియ ఎరువులంటే..

సేంద్రియ ఎరువుల్లో పశువుల ఎరువు, మేకలు, గొర్రెల ఎరువు, వర్మి కంపోస్ట్‌తో పాటు కోళ్ల పెంట ప్రముఖమైనవి. వీటిల్లో మొక్కలకు కావాల్సిన అన్నిరకాల ప్రధాన పోషకాలు (స్థూల), సూక్ష్మ పోషకాలైన జింక్, మెగ్నీషియం, మాంగనీస్, బోరాన్ తదితర పోషకాలు మొక్కలకు దొరుకుతాయి. తక్కువ ధరలో ఎక్కువ పోషకాలు లభించే ఏకైక సేంద్రియ ఎరువు కోళ్ల ఎరువు మాత్రమే. కోళ్ల ఎరువులో ఎక్కువ మొత్తంలో నత్రజని 3 శాతం, భాస్వరం 2.5 శాతం, పొటాష్ 1.2 శాతం ఉంటాయి. ఉద్యాన పంటలైన కూరగాయల పంటలకు ఎకరానికి 500 కేజీల కోళ్ల ఎరువు సరిపోతుంది. ఈ ఎరువును రసాయన ఎరువుతో కలిపి వాడినట్లయితే 20 నుండి 25 శాతం నత్రజనిని ఆదా చేయవచ్చు. కోళ్ల ఎరువును వివిధ ఉద్యాన పంటల్లో తగిన మోతాదులో వినియోగిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు.

మొక్కలకు కోళ్ల పచ్చి ఎరువు వేయవద్దు



కోళ్ల పచ్చి ఎరువును ఎట్టి పరిస్థితుల్లోను మొక్కలకు వేయరాదు. దీనిలో యూరిక్ యాసిడ్ ఎక్కువగా ఉండటం వల్ల వేరు వ్యవస్థ మాడిపోయి మొక్కలు దెబ్బతినే ప్రమాదం ఉంది. కోళ్ల ఎరువును సేకరించి బాగా మాగిన తరువాత మొక్కలకు వేసుకోవాలి. ఒక టన్ను కోళ్ల ఎరువుకు 15 కేజీల సూపర్ ఫాస్పేట్ కలిపితే తొందరగా కుళ్లిపోతుంది. కోళ్ల ఎరువును సాధారణంగా మొక్కలు నాటడానికి 20 రోజుల ముందుగా వేయాలి.

– అడపా దుర్గేష్, ఏడీ, ఉద్యాన శాఖ

పంట	ఎరువు మోతాదు
ఆయిల్‌పామ్	ఆరేళ్ల వయస్సున్న కాపుకాసే చెట్టుకు 50 కేజీలు
కొబ్బరి	ఎనిమిదేళ్ల వయస్సున్న కాపుకాసే చెట్టుకు 30 – 50 కేజీలు
అరటి	ఎకరానికి 5 టన్నుల కోళ్ళ ఎరువు వేయాలి
మామిడి	పదేళ్ల కాపుకాసే చెట్టుకు 50 – 70 కేజీలు
జీడి మామిడి	ఏడేళ్ల వయస్సున్న కాపుకాసే చెట్టుకు 40 కేజీలు
నిమ్మ, బత్తాయి	ఆరేళ్ల వయస్సున్న కాపుకాసే చెట్లకు 30 కేజీలు
బొప్పాయి	ఎకరానికి 3 – 5 టన్నులు
మిరప	ఎకరానికి 3 టన్నులు
పూల తోటలకు	ఎకరానికి 2 టన్నులు

ఏసీబీ వలలో ఏలూరు ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్

- గిఫ్ట్‌డీడ్ రిజిస్ట్రేషన్ చేసేందుకు రూ.10 వేలు డిమాండ్
- లంచం సొమ్ము తీసుకుంటూ పట్టుబడిన జోగేశ్వరరావు
- ఏలూరు ఏసీబీ డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ వెల్లడి


ఏలూరులో ఏసీబీకి చిక్కిన ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ జోగేశ్వరరావు

ఏలూరు టౌన్: గిఫ్ట్‌డీడ్ రిజిస్ట్రేషన్ చేసేందుకు రూ.10 వేలు లంచం తీసుకుంటూ ఏలూరు ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ బళ్లారి జోగేశ్వరరావు రెడ్‌హ్యాండెడ్‌గా ఏసీబీ వలకు చిక్కారు. ఏలూరు ఏసీబీ డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం కూచింపూడి గ్రామానికి చెందిన కూచిపూడి రాంబాబుకు గ్రామంలో ఇల్లు ఉంది. దీనిని రాంబాబు తన భార్యపేరున గిఫ్ట్ డీడ్‌గా రిజిస్ట్రేషన్ చేయాలని నిర్ణయించుకున్నాడు. ఇందుకోసం ఏలూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి వివరాలు అడిగారు. కానీ రూ.15 వేలు ఇస్తే గానీ ఆస్తిని రిజిస్ట్రేషన్ చేయలేమని ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ బళ్లారి జోగేశ్వరరావు అతనికి స్పష్టం చేశారు. అంత సొమ్ము ఇవ్వలేనని బతిమిలాడగా ఆఖరికి రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యాలయంలో పూర్తి స్థాయిలో విధుల్లో ఉన్న సబ్ రిజిస్ట్రార్ అనారోగ్యంతో సెలవులో ఉండగా, కార్యాలయ సీనియర్ సూపరింటెండెంట్ బళ్లారి జోగేశ్వరరావు ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా విధుల్లో ఉన్నారు. జోగేశ్వరరావు రూ.10 వేలు ఇస్తే గానీ రిజిస్ట్రేషన్ సాధ్యం కాదని చెప్పటంతో బాధితుడు రాంబాబు అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించాడు.

ఇలా పట్టివేశారు..

ఏలూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై గత కొంతకాలంగా అవినీతి ఆరోపణలు, ఫిర్యాదులు రావటంతో ఏలూరు ఏసీబీ అధికారులు సమయం కోసం వేచి ఉన్నారు. ఈ నేపథ్యంలో కూచింపూడి గ్రామానికి చెందిన కూడిపూడి రాంబాబు ఏసీబీ అధికారులను ఆశ్రయించటంతో వారు రంగంలోకి దిగారు. సోమవారం యథావిధిగా రాంబాబుకు రూ.10 వేలు నగదు ఇచ్చి లోనికి పంపారు. ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ జోగేశ్వరరావు వ్యక్తిగతంగా కార్యాలయంతో సంబంధం లేకుండా గొల్లాయిగూడేనికి చెందిన ఐనవల్లి క్రాంతికుమార్ అనే వ్యక్తిని అసిస్టెంట్‌గా పెట్టుకున్నాడు. రాంబాబు రూ.10 వేలు తీసుకుని రాగా డబ్బులు క్రాంతికుమార్‌కు ఇవ్వాలని చెప్పాడు. సొమ్ము క్రాంతికుమార్ జేబులో పెట్టుకున్న అనంతరం ఏసీబీ అధికారులు ఒక్కసారిగా దాడి చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సొమ్మును ప్రత్యేకమైన ద్రావకంతో పరీక్షించి నిర్ధారించారు. వారిద్దరిపై కేసు నమోదు చేసి ఏసీబీ కోర్టులో హాజరుపర్చుతామని ఏసీబీ డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ చెప్పారు. ప్రజలు అవినీతిని ప్రోత్సహించకూడదని, ఎవరైనా ప్రభుత్వ అధికారులు, సిబ్బంది లంచం అడిగితే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఈ దాడుల్లో ఏసీబీ సీఐలు యేసుబాబు, భాస్కరరావు, నాగేంద్రప్రసాద్ ఉన్నారు.

● గడపగడపకు సంక్షేమం


తాడేపల్లిగూడెం రూరల్: ఆరుగొలనులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మహిళలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

డిజిటల్ అసిస్టెంట్ సస్పెన్షన్

పాలకోడేరు: గొల్లలకోడేరు సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ బొక్కా జయశ్రీని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సస్పెండ్ చేసినట్లు ఎంపీడీవో నూకల మురళీగంగాధర్ రావు చెప్పారు. గ్రామానికి చెందిన దర్భా శివలింగమూర్తి పింఛను కోసం దరఖాస్తు చేసుకున్నారు. కొద్ది రోజుల తరువాత ఆలస్యంపై కుటుంబ సభ్యులు ప్రశ్నించగా జయశ్రీ దురుసుగా సమాధానమిచ్చారు. దీంతో వారు స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేయగా, విచారణ జరిపి జిల్లా కలెక్టర్ జయశ్రీని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు.

హైస్కూల్ ప్లస్‌లో బోధనకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉమ్మడి జిల్లాలో 2022-23 విద్యా సంవత్సరంలో ప్రారంభించిన హైస్కూల్ ప్లస్‌లలో సబ్జెక్టు టీచర్లుగా పనిచేయడానికి తెలుగు, ఇంగ్లిష్, గణితం, ఫిజిక్స్, బోటనీ, జువాలజీ, సివిక్స్, ఎకనామిక్స్, కామర్స్ సబ్జెక్టుల్లో పీజీ అర్హత కలిగి ప్రస్తుతం ప్రభుత్వ, జిల్లా పరిషత్ యాజమాన్య పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ ఎన్‌వీ రవి సాగర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన ఉపాధ్యాయులు వారి వివరాలను డీఈఓ ఏలూరు వెబ్‌సైట్‌లో విల్లింగ్ ప్రొఫార్మాలో పూర్తి చేసి వారి పరిధిలోని డీవైఈఓ కార్యాలయాల్లో ఈ నెల 9వ తేదీలోగా సమర్పించాలన్నారు. ఇంగ్లిష్ భాషలో ప్రావీణ్యం, వాక్చాతుర్యం కలిగి అర్హతలు కలిగిన ఉపాధ్యాయులకు వారి సబ్జెక్టుల్లో నైపుణ్యంపై పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఈ పరీక్ష వివరాలు త్వరలో వెల్లడిస్తామన్నారు. ఈ పరీక్షలో అర్హత పొందిన ఉపాధ్యాయులకు వారి సీనియారిటీ ప్రకారం కౌన్సెలింగ్ ద్వారా సంబంధిత హైస్కూల్ ప్లస్‌లో ఒక ఇంక్రిమెంట్ అదనంగా మంజూరు చేస్తూ నియమిస్తామన్నారు. హైస్కూల్ ప్లస్‌లో నియమితులైన స్కూల్ అసిస్టెంట్‌ల సీనియారిటీ పూర్వపు సీనియారిటీలోనే కొనసాగుతుందని స్పష్టం చేశారు.

రైళ్ల నుంచి జారిపడి ఇద్దరి మృతి

ఏలూరు, నూజివీడులో వేర్వేరు ఘటనలు


నూజివీడులో మృతి చెందిన వ్యక్తి


ఆటోనగర్ ప్రాంతంలో మృతి చెందిన వ్యక్తి

ఏలూరు టౌన్: ఏలూరు, నూజివీడు రైల్వేస్టేషన్ల సమీపాల్లో వేర్వేరు ఘటనల్లో రైళ్ల నుంచి జారిపడి ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. ఏలూరు రైల్వే పోలీసులు సోమవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నూజివీడు రైల్వే స్టేషన్ సమీపంలో రైలు నుంచి జారిపడి ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. 5.5 అడుగుల ఎత్తు, కోల ముఖం కలిగి ఉన్నాడు. పిస్తా రంగు పొట్టి చేతుల టీషర్ట్, నలుపురంగు జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతుని ఎడమచేయి భుజం కింద 17 నంబర్ పచ్చబొట్టు, ఎడమ చేయిపై లవ్ సింబల్ గుర్తుతో పచ్చబొట్టు ఉంది. ఏలూరు రైల్వే హెచ్‌సీ నంబూరి ఆదినారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు. వివరాలకు 80740 55378 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు. మరో ఘటనలో ఏలూరు నగర శివారు ఆటోనగర్ ప్రాంతంలో బ్రిడ్జికింద ఒక వ్యక్తి గుర్తు తెలియని వ్యక్తి రైలు నుంచి ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందాడు. 5.7 అడుగుల ఎత్తు, గుండ్రని ముఖం, చామనఛాయ రంగు కలిగి ఉన్నాడు. మృతుని వద్ద నెల్లూరు నుంచి నిడదవోలు జంక్షన్ వరకు రైలు టికెట్ ఉంది. మృతుడు తెలుపు రంగు పొడవు చేతుల చొక్కా, నీలం రంగు జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతుని వద్ద సిమెంట్, నలుపు రంగుతో బ్యాగ్ ఉండగా దానిలో దుస్తులు ఉన్నాయి. ఏలూరు రైల్వే ఏఎస్సై పీ.సైమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుని వివరాలు తెలిసిన వారు 99892 19559కు సంప్రదించాలని కోరారు.

ఇద్దరు క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకుల అరెస్టు

- మరో 8 మంది వ్యక్తులపై కేసు నమోదు
- రూ.11 వేల నగదు, ల్యాప్‌టాప్ స్వాధీనం
- ఏలూరు టూటౌన్ సీఐ చంద్రశేఖర్ వెల్లడి

ఏలూరు టౌన్: ఏలూరు టూటౌన్ పరిధిలో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఏలూరు చోడిదిబ్బ సాయితిరుమల జ్యూస్‌షాప్‌లో గాలాయిగూడేనికి చెందిన తోట అశోక్, తంగెళ్లమూడి ఎంఆర్‌సీ కాలనీకి చెందిన బొట్టా సాయికుమార్ ఆదివారం రాత్రి ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ గుజరాత్ టైటాన్స్, లక్నో సూపర్ జెయింట్స్ మధ్య సాగిన మ్యాచ్‌పై బెట్టింగ్ నిర్వహించారు. లైన్ గురు అనే యాప్ ద్వారా తమ సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌తో క్రికెట్ బెట్టింగ్‌ను వారితో పాటు మరికొంతమందితో చేయిస్తూ ఉండగా ఏలూరు ఇన్‌చార్జి డీఎస్పీ జీవీఎస్ పైడేశ్వరరావు పర్యవేక్షణలో ఏలూరు టూటౌన్ సీఐ పి.చంద్రశేఖర్ తమ సిబ్బందితో దాడి చేసి వారిద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. మధ్యవర్తి సమక్షంలో వారివద్ద ఉన్న బెట్టింగ్ డబ్బులు రూ.11 వేల నగదు, రెండు సెల్‌ఫోన్లు, ఒక ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకున్నారు. వీరిని విచారణ చేయగా, మరో 8 మంది ఉన్నట్లు తెలిపారని, వారిలో ముసునూరు మండలం గోగులంపాడుకు చెందిన మండవ అశోక్‌బాబు అనే అతని బ్యాంక్ అకౌంట్‌లో బెట్టింగ్ డబ్బులు వేస్తారని, దానికి ప్రతిఫలంగా వీరికి రూ.లక్షకు రూ.3 వేలు కమీషన్ ఇస్తాడని తెలిందన్నారు. వీరందరిపై కేసు నమోదు చేయటంతోపాటు వారి బ్యాంకు అకౌంట్లు నిలుపుదల చేసి, మిగిలిన నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టామని సీఐ చంద్రశేఖర్ చెప్పారు. ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభమైన నాటినుంచీ ఏలూరు టూటౌన్ పరిధిలో నాలుగు క్రికెట్ బెట్టింగ్ బుకీలపై దాడులు చేసి 37 మందిపై కేసులు నమోదు చేశామని సీఐ వివరించారు.

జగన్ పాలనలో సంతోషంగా పేదలు

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- ఆరుగొలను గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం


తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలను గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. సోమవారం సాయంత్రం తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలను గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. అనంతరం కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో అందరికీ న్యాయం జరుగుతుందని, అటువంటి వ్యక్తిని నిలబెట్టుకోవాలని ప్రజల్ని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలతో పేదలు సంతోషంగా జీవిస్తున్నారని అన్నారు. పార్టీ, వర్గ భేదాలు లేకుండా అర్హతున్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకం అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలన మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనను మరిపిస్తోందని వివరించారు. లక్షలాది మంది పేదల సొంతింటి కల నెరవేర్చడంతో పాటు పథకాలతో ఆర్థిక భరోసా, ఆరోగ్య భద్రత కల్పించారని కొనియాడారు. పేదల సంక్షేమం, అభివృద్ధికి రూ.కోట్లు వెచ్చిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వైకేవీ.అప్పారావు, ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో వీఎస్.వేణుగోపాల్, వెలుగు ఏపీఎం జీవీకేడీఎం.లక్ష్మి, వెటర్నరీ డాక్టర్ టి.దివ్యశ్రీ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస చంద్రరాజు, పీఆర్ ఏఈ జి.పవన్‌కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ఆర్.శ్రీనివాస్, ఎలక్ట్రికల్ ఏఈ అల్లు రామకృష్ణ, ఎమ్పీటీసీలు నార్ని శంకరరావు, నార్ని నాగేశ్వరరావు (నాగులు), మార్లపూడి సుబ్బారావు, ఉప సర్పంచ్ అడపా అప్పలరాజు, గ్రామ పార్టీ అధ్యక్షుడు అడపా వెంకన్నబాబు, సొసైటీ చైర్మన్లు చిక్కాల సత్యనారాయణ, వెలిశెట్టి నరేంద్రకుమార్, నాయకులు ముప్పిడి సంపత్‌కుమార్, ఆరేపల్లి సుబ్బారావు, కామన చంద్రరావు, సబ్బితి బ్రహ్మయ్య, వట్టూరి నాగులు, బొద్దాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం


అత్తిలిలో ఉమర్ ఆలీషా ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం

అత్తిలి: విశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం ఆధ్వర్యంలో ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు అత్తిలి శాఖ తరఫున మజ్జిగ చలివేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన తీర్ధాల బ్రహ్మయ్య, దాసం వెంకటరమణ, దంగేటి నారాయణరావు ఆర్థిక సహకారంతో చలివేందాన్ని ఏర్పాటు చేశారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి మజ్జిగ చలివేంద్రాలను నిర్వహిస్తున్నామని పీఠం సభ్యులు తెలిపారు.

క్లుప్తంగా

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బి.హరికుమార్

తాడేపల్లిగూడెం (టీఓసీ): రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా కార్యవర్గం సమావేశం ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించింది. సోమవారం గూడెం అసోసియేషన్ కార్యాలయంలో బి.హరికుమార్ అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ ఈకేవైసీ పేరిట పెన్షన్ నిలుపుదల చేయవద్దని కోరారు. డీఆర్, పీఆర్సీ బకాయిలను చెల్లించాలని కోరారు.ఈ సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షుడు కాయల నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వైవీ సత్యనారాయణమూర్తి, కోశాధికారి వి.రామ్మోహన్‌రావు, జిల్లా సభ్యులు, తాలూకా యూనిట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హైజినిక్ కిట్ల పంపిణీ


కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం సందర్భంగా సోమవారం ఉదయం చైర్మన్ భద్రిరాజు ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్‌లో రాయలం, చినమిరం పంచాయతీ పారిశుధ్య కార్మికులు సుమారు 50 మందికి హైజినిక్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ బద్రిరాజు మాట్లాడుతూ బ్లడ్ డొనేషన్ అవశ్యకతను వివరించారు. పంచాయతీ కార్యదర్శి కిషోర్, రెడ్ క్రాస్ మేనేజ్మెంట్ కమిటీ మెంబర్లు తిరుపతి రాజు, గోపాలకృష్ణ రాజు పాల్గొన్నారు.

ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు

సాక్షి, భీమవరం: స్థానిక ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభిస్తునట్టు కళాశాల ప్రిన్సిపాల్ వీకేజే ప్రసూన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల సిబ్బంది పట్టణం పరిసర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్నారన్నారు. తమ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులున్నాయని అనుభవం కలిగిన అధ్యాపకులతో విద్యాబోధన చేస్తున్నామని ఇంటర్మీడియట్ పాసయిన విద్యార్థులు ఈనెల 10 నుంచి కళాశాల కార్యాలయంలో అడ్మిషన్ల కోసం పేర్లు నమోదు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ప్రసూన తెలిపారు. వివరాల కోసం 08816 22345, సెల్ నెంబర్ 98664 45077కు సంప్రదించాలని ఆమె కోరారు.

విద్యావ్యాపారాన్ని అరికట్టాలి


డీఈఓ వెంకటరమణకు వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సాక్షి, భీమవరం: ప్రభుత్వ నిబంధనలు పాటించని కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో సోమవారం జిల్లా విద్యాశాఖాధికారి ఆర్ వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లాఅధ్యక్షుడు పి.వాసు మాట్లాడుతూ జిల్లాలో కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు పుస్తకాలు, యూనిఫామ్ పేర్లతో వ్యాపారం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అధికారికంగా అడ్మిషన్లు ప్రారంభించక ముందే విద్యా సంస్థలు విద్యను వ్యాపారంగా మార్చారని వాపోయారు.

శాస్త్రోక్తంగా చండీహోమం

భీమవరం(ప్రకాశం చౌక్): స్థానిక మెంటేవారి తోటలో కొలువైన శ్రీబాలత్రిపుర సుందరీదేవి అమ్మవారి దేవస్థానం వార్షికోత్సవాల్లో భాగంగా సోమవారం సంప్రదాయబద్ధంగా చండీహోమం నిర్వహించారు. ఆలయ అర్చకుడు కొమ్ము శ్రీనివాస్ ఆధ్వర్యంలో తొలుత అమ్మవారికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, గణపతి హోమం, విజయ గణపతికి గరిక పూజ నిర్వహించారు. మద్దాల సత్యనారాయణ, లక్ష్మి బ్రహ్మాజీ దంపతులచే చండీహోమం చేశారు.

విద్యార్థినితో అసభ్య ప్రవర్తన.. నిందితుడిపై కేసు నమోదు

తణుకు: తణుకు పట్టణానికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థిపై అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై కె.శ్రీనివాస్ తెలిపారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన కోత మిషన్ డ్రైవర్ పన్నీరు అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. స్థానిక ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్న ఇంజినీరింగ్ విద్యార్థి సోమవారం కళాశాల నుంచి తిరిగి ఇంటికి వెళ్తుండగా మద్యం తాగిన పన్నీరు మార్గమధ్యలో ఆమెను ఆపి ఆమెపట్ల అసభ్యంగా ప్రవర్తించి దాడి చేసినట్లు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ వెల్లడించారు.

వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి


అత్తిలి శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ గంటా విజేత


వేసవి శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న విశ్రాంత ఎంఈఓ ఎస్.సాల్మన్‌రాజు


వేల్పూరు గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు


మహిళా గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

అత్తిలి: విద్యార్థుల్లో పఠనాశక్తి, జ్ఞాపకశక్తిని పెంపొందించడానికి వేసవి శిక్షణశిబిరాలు దోహదపడతాయని సర్పంచ్ గంటా విజేత నాగరాజు అన్నారు. అత్తిలి శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి శిక్షణ శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను తిలకించారు. కార్యక్రమంలో రిటైర్డు లైబ్రేరియన్ గంధం శేషవేంద్రరావు, వార్డు మెంబర్‌లు గారపాటి నాగరాజు, లోకం వెంకట సరస్వతి సత్యనారాయణ, యడ్లపల్లి మణికుమార్, డ్రాయింగ్ టీచర్ అమర్, పి వెంకటేశ్వరరావు, వి లక్ష్మణరావు, గ్రంథాలయాధికారి డి కృష్ణారావు పాల్గొన్నారు. అదేవిధంగా ఆరవల్లి శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. విద్యార్థులను ఇండోర్ గేమ్స్ ఆడించారు. గ్రంథాలయాధికారి సత్తి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం (టీఓసీ): వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు ప్రత్తి వీరాస్వామి అన్నారు. పట్టణంలోని ప్రథమ శ్రేణి శాఖ గంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. గ్రంథాలయాధికారి వానపల్లి శ్రీనివాసరావు పర్యవేక్షించారు. నలభై మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. తెలుగు మాస్టారు మహాశివభట్లు లక్ష్మణరాజుచే తెలుగు భాష ఔనత్యాన్ని చెప్పారు. ఎ.జనార్ధనరావుచే తెలుగులో కవితలు, హిందీ భాషలో మెళుకవులు నేర్పారు. ప్రత్తి వీరాస్వామిచే ఆటపాటలతో సైన్స్ విషయాలను వెల్లడించారు. విశ్రాంత ఎంఈఓ ఎస్.సాల్మన్‌రాజుచే ఇంగ్లీషు భాష ప్రాధాన్యత, కథలు, వివిధ అంశాలను నేర్పించారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ సిబ్బంది మధుసూదనరావు, రమణ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలి

తణుకు టౌన్: విద్యార్థులు సెల్ ఫోన్‌లకు దూరంగా, పుస్తకాలకు దగ్గరగా వుండాలని ప్రముఖ న్యాయవాది గుడిమెట్ల గుర్రెడ్డి చెప్పారు. గ్రంథాలయాల ఆధ్వర్యంలో ప్రభుత్వం చేపట్టిన విద్యార్థులకు వేసవి శిక్షణా శిబిరాలు సోమవారం తణుకు మండలంలోని వేల్పూరు, తణుకులోని పురుషుల శాఖా గ్రంథాలయం, మహిళా గ్రంథాలయాల ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో విద్యార్థులతో పాటు రిటైర్డ్ ఉపాధ్యాయులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, ఉద్యోగులు పాల్గొన్నారు. ఈసందర్భంగా తణుకు పురుషుల శాఖా గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో న్యాయవాది గుడిమెట్ల వీర్రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ముఖ్యంగా నేటి బాల బాలికలు సెల్‌ఫోన్ వలన సమయాన్ని వృథా చేస్తున్నారని, అందుకు సెల్ ఫోన్‌కు దూరంగా వుండాలని కోరారు. పుస్తక పఠనంపై ఆశక్తి పెంచుకోవాలని అందుకు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోసూరి గాంధీ, గ్రంథాలయ అధికారి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. వేల్పూరులో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు పుస్తక పఠనం, కథలు చెప్పడం, స్పోకెన్ ఇంగ్లీష్ వంటి ఈకార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈవో కోరా సత్యనారాయణ, రిటైర్డ్ ఏఈ కేఆర్ చక్రధరరావు, హెచ్ఎం జీ శ్రీనివాస్, ఎం సీతా రామంజనేయులు, జీ బసవయ్య, ఎం నవీన్, ఎం పాపారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా గ్రంథాలయం ఆధ్వర్యంలో...

తణుకు మహిళా గ్రంథాలయం ఆధ్వర్యంలో విద్యార్థులకు వేసవి శిక్షణా శిబిరాన్ని ఉత్సాహంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యురాలు బసవ శ్రీదేవి ప్రారంభించారు. ఈకార్యక్రమంలో రచయిత్రి యర్రమిల్లి విజయలక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొని వేసవి శిక్షణా తరగతుల ఉద్దేశ్యాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏ లక్ష్మీదేవి, జీ దివ్య, గ్రంథాలయ అధికారి ఎస్ ప్రవీణ, విద్యార్థులు పాల్గొన్నారు.

మోదీ గద్దె దిగే వరకు పోరాటాలు


అర్జునుడుపాలెంలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ఇరగవరం: ఉపాధి కూలీలు ఐక్యతతో ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రం అన్నారు. మండలంలోని అర్జునుడు పాలెం శివారు పెద్దిరెడ్డి పాలెం, కంతేరు గ్రామాల్లో ఉపాధి హమీ కూలీలతో మాట్లాడి వారు పడుతున్నా ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీరభద్రం మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ గద్దె దిగే వరకూ పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని, లౌకిక వ్యవస్థను పరిరక్షించుకోవాలంటే ప్రధాని మోదీ గద్దె దిగాలన్నారు. ఉపాధి కూలీలకు రద్దు చేసి సమ్మర్ అలవెన్స్ తిరిగి ఇవ్వాలన్నారు. పాత పద్దతిలో పని విధానం కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ నెల 12వ తేదిన భీమవరం కలెక్టర్ ఆఫీస్ వద్ద జరుగుతున్న ధర్నాలో పెద్ద సంఖ్యలో ఉపాధి కూలీలు పాల్గొవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీయం నాయకులు తామరపల్లి మునలియ్య, గంటా శ్రీను, పొట్ల బాలయ్య, బొర్రా ఆంజనేయులు, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం


అత్తిలి మండలం ఉనికిలిలో త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలను ప్రచారం చేస్తున్న దృశ్యం

అత్తిలి: త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం సోమవారం అత్తిలి మండలం ఉనికిలి గ్రామంలో నిర్వహించారు. త్రైత సిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్మాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రచారం చేశారు. త్రైత సిద్ధాంత భగవద్గీత జ్ఞానం ద్వారా సమాజంలో ఉన్న కులమతాలను రూపుమాపడానికి, ప్రజల మధ్యలో ఉన్న అసమానతలను తొలగించడానికి సర్వమతాలకు దేవుడు ఒక్కడే అని ప్రజల్లో దైవ భక్తిని పెంపొందించడానికి దోహదం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక భీమవరం కమిటీ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, సభ్యులు నాగేశ్వరరావు, వాసేదేవా, ప్రసాద్, సత్యనారాయణ, గోపి, రాము, మూర్తి, శ్రీకర్ పాల్గొన్నారు.

సేవకులకు, విశ్వాసులకు యూపీఎఫ్ బాసట


పాస్టర్లకు గుర్తింపు కార్డులు అందిస్తున్న జైబాబు తదితరులు

పెంటపాడు: దైవసేవకులకు, విశ్వాసులకు యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్(యూపీఎఫ్) నిరంతరం బాసటగా ఉంటుందని ఆ సంఘ అధ్యక్షుడు మల్లిపూడి జైబాబు పేర్కొన్నారు. గూడెం భాగ్యలక్ష్మీపేట ఎల్ఎల్ఎం చర్చిలో యూనెటెడ్ పాస్టర్స్‌ఫెలోషిప్ 5 వసంతాల వేడుక పురస్కరించుకొని సంఘ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. బిషప్ ఐజక్ ముగ్గళ్ల అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయన దేవునివాక్యం అందించారు. పలువురు సేవకులు ప్రసంగించారు. ఈ సందర్భంగా జైబాబు మాట్లాడుతూ పాస్టర్ల ఫెలోషిప్ ద్వారా సంఘ ఐక్యత, పలు సమస్యల పరిష్కారం సాధ్యమన్నారు. సేవకుల సంఘ పటిష్టత వల్ల దేవుని రాజ్య సువార్త ప్రతి వారికి అందుతుందన్నారు. దేవుని దయతో సంఘం 5 వసంతాలు పూర్తి చేసుకొన్న సందర్భంగా సంఘ సభ్యులకు అభినందనలు తెలిపారు. నూతనంగా సభ్యులుగా చేరిన వారికి గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి ఎన్. అబ్రహం, కోశాధికారి డేవిడ్ లివింగ్‌స్టన్, ఉపాధ్యక్షులు కె. రత్నరాజు, కార్యవర్గం పి.శామ్యూల్ సునీల్, మనష్షే, యెహెజ్కేలు కరుణాకర్, సాల్మన్ రాజు, జాన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం


కార్యక్రమంలో పాల్గొన్న ప్రత్యేక అధికారి, తహసిల్దార్, ఎంపీడీవో, ఇతర అధికారులు

తణుకు టౌన్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని తహసిల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ తెలిపారు. సోమవారం తణుకు తహసిల్దార్ కార్యాలయంలో పాస్టర్లు, పురోహితులు, ముస్లీం పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ బాల్య వివాహాలు నివారించడానికి పురోహితుల, పాస్టర్లు, ముస్లీం పెద్దలు సహకరించాలని కోరారు. బాల్య వివాహాలు జరగకుండా చూడాలన్నారు. పెళ్లిళ్లు చేసే సమయంలో వధూవరుల వివాహ వయస్సును తెలుసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి పీ శ్రీనివాసరావు, ఎంపీడీవో టీఎస్ మూర్తి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎం అరుణ కుమారి, సీహెచ్ వెంకట లక్ష్మీ, కె కుమారి, తదితరులు పాల్గొన్నారు.

పంట బోదె అక్రమణపై ఫిర్యాదు...

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని ఎన్టీయార్ కాలనీకి ఆనుకుని ఉన్న పంట కాలువ ఆక్రమణ చెర నుంచి కాపాడాలని కోరుతూ రైతులు తహసిల్దార్ పీఎన్‌డీ ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం తహసిల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఈమేరకు వినతి పత్రాన్ని అందజేశారు. ప్రస్తుత వేసవి కాలంలో పంట కాలువను అక్రమణలు తొలగించి పూడికతీత పనులు చేపట్టాలని కోరారు. రైతులు శ్రీనివాసు, గోపాల కృష్ణ, పాల్గొన్నారు.

నేత్రపర్వం.. సింహాద్రి అప్పన్న కల్యాణం


పెంటపాడులో కల్యాణ తంతు నిర్వహిస్తున్న దృశ్యం


కల్యాణంలో పాల్గొన్న భక్తులు

పెంటపాడు: మండలంలోని ప్రభుత్వ బేసిక్ పాఠశాలలోని వెలగల నాగ సూర్యకుమారి కళావేదికపై సోమవారం రాత్రి సింహాచల దేవస్థానం ఆధ్వర్యంలో సింహాద్రి అప్పన్న కల్యాణం కమనీయంగా సాగింది. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు, ఉపార్చకులు కల్యాణతంతుకు సంబంధించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు గ్రామాల నుంచి భక్తులు పాల్గొన్నారు. ఆహ్లాదకర వాతావరణంలో సాగిన ఈ వేడుక రాత్రి పొద్దుపోయేవరకు జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న యువనేత కొట్టు విశాల్ కల్యాణంలో పాల్గొన్న దంపతులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ సనాతన హైందవ ధర్మాన్ని అనుసరించి హిందూ ధర్మ సిద్ధాంతాలను కాపాడాలన్నారు. రాష్ట్రంలో అంత్యంత పవిత్ర దేవాలయంగా వెలుగొందుతున్న సింహాచల వరాహాలక్ష్మి నరసింహస్వామివారి ఆశీస్సులు ఈ ప్రాంత ప్రజలకు మెండుగా ఉండాలన్నారు. ఆలయ అర్చకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సింహాచల దేవస్థానం అర్చకులు, సిబ్బంది యువనేత కొట్టు విశాల్‌ను ఆశీర్వదించి, సన్మానించారు. ఈ కార్యక్రమంలో పెంటపాడు గ్రామ ప్రజలు, రెడ్డి యూత్ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కాళ్లకూరు వెంకన్నకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకణలో స్వామి అమ్మవార్లు

కాళ్ల : కాళ్లకూరులో వేంచేసియున్న స్వయంభూ శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో శ్రీ స్వామివారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి అమ్మవార్లకు భక్తులందరితో కలిసి ద్వాదశ కోవెల ప్రదక్షిణలు చేశారు. దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షుడు దండు వెంకట కృష్ణంరాజు-ప్రవంతి దంపతులచే చక్రాబ్ది మండలార్చన, శ్రీ పుష్ప యాగం, ద్వాదశ ప్రసాదములు నివేదన, నీరాజన, మంత్రపుష్పములు ఘనంగా జరిపారు. అనంతరం భక్తులందరికీ 12 రకాల విశేష ప్రసాదాల వితరణ చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యంకలగకుండా దేవస్థానం కార్యనిర్వహణాధికారి మోకా అరుణ్ కుమార్ ఏర్పాట్లు చేశారు.

తపాలా బీమా ఏజెంట్స్ ఎంపికకు 10న ఇంటర్వ్యూలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): భారత ప్రభుత్వ తపాలా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించుచున్న పోస్టల్ జీవిత బీమా (పీఎల్ఐ), తపాలా జీవిత బీమా (ఆర్‌పీఎల్ఐ) పాలసీలను స్వీకరించుటకు గాను తపాలా ఏజెంట్‌ల ఎంపిక కోసం మే 10వ తేదీ ఉదయం 11 గంటలకు ఆసక్తిగల అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరుకావాలని తాడేపల్లిగూడెం సూపరింటెండెంట్ సీవీ రామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్ విద్యార్హత గల అభ్యర్థులు ఈనెల 15న తాడేపల్లిగూడెం హెడ్ పోస్టాఫీసులు ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికేట్స్‌తో హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు.

వ్యక్తిని గాయపర్చిన నేరంపై కేసు నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: పొలం విషయంలో ఒక వ్యక్తిని గాయపర్చిన నేరంపై బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్సై వీరభద్రరావు తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఇటుకల గుంట గ్రామానికి చెందిన పాశం వీర్రాజు, పాశం శ్రీను మధ్య పొలం విషయంలో ఒప్పందం ఉంది. అయితే ఒప్పందాన్ని పట్టించుకోకుండా తన పొలం తనకివ్వాలని పాశం వీర్రాజుతో శ్రీను గొడవ పడ్డారు. దీనిని వారించిన పాశం వీర్రాజుపై శ్రీను కర్రతో దాడి చేశాడు. వీర్రాజు కుడి చేయి విరిగింది. ఈ సంఘటన ఆదివారం సాయంత్రం జరిగింది. సోమవారం బాధితుడు వీర్రాజు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూరల్ ఎస్సై వీరభద్రరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సాక్షి, భీమవరం: వేమగిరి సబ్‌స్టేషన్‌లో కొత్త పనుల నిమిత్తం 220 కేవీ వేమగిరి – ఉండి ఫీడర్లో విద్యుత్ సరఫరాను బుధవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిలుపుదల చేస్తున్నట్టు ఈఈ పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. 132 కేవీ భీమవరం, ఆకివీడు, ఉండి సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా రొటేషన్ బేసెస్లో లోడ్ రిలీఫ్ ఉంటుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో భీమవరం పట్టణంలో, వీరవాసరం మండలం, ఆకివీడు మండలం, ఉండి మండలం, కాళ్ల, పాలకోడేరు మండలంలోని శృంగవృక్షం, బంటుమిల్లి, విస్సాకోడేరు, మోగల్లు, కుముదవల్లి, పాలకోడేరు గ్రామాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తామని పేర్కొన్నారు.

ఐఏఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రంగారావు

సాక్షి, భీమవరం: ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ (ఐఏఎల్) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా భీమవరం పట్టణానికి చెందిన న్యాయవాది చెల్లబోయిన రంగారావు ఎన్నికయ్యారు. రాజమహేంద్రవరంలో నిర్వహించిన ఐఏఎల్ రాష్ట్ర మహాసభల్లో నూతన కమిటీ ఎన్నిక నిర్వహించినట్టు రంగారావు సోమవారం భీమవరంలో విలేకర్లకు తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన నెక్కంటి క్రాంతికుమార్(నరసాపురం), అశోక్‌కుమార్ (తణుకు), వైవీ ఆనంద్ (తాడేపల్లిగూడెం), యేలేటి న్యూటన్, మల్లుల శ్రీనివాసు(భీమవరం), బండి వెంకటేశ్వరరావు(ఏలూరు), నున్న సీతారామయ్య(జంగారెడ్డిగూడెం) రాష్ట్ర కార్యవర్గసభ్యులుగా ఎన్నికైనట్టు వివరించారు.

కేశవానంద భారతి తీర్పుపై సదస్సు


డాక్టర్ కేశవానంద భారతి కేసు, తీర్పును చర్చా కార్యక్రమంలో పాల్గొన్న జడ్జిలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కేశవానంద భారతి వర్సస్ స్టేట్ ఆఫ్ కేరళ కేసులో చారిత్రత్మక తీర్పు వెలువరించి ఏళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం గూడెంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా గూడెం కోర్టుకు నూతనంగా విచ్చేసిన ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.సూర్య కిరణశ్రీ, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి అన్నామణిల పరిచయ కార్యక్రమ నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి ప్రకాశ్‌బాబు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొవ్వూరి అప్పిరెడ్డిలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు గొల్లపూడి శ్యాం ప్రసాద్ ముఖర్జి, రాంబాబు, మనోహర్, సోమేశ్వరరావు, ఎం.రామారావు, న్యాయవాదులు తదితరులు హాజరైయారు.

పెన్షనర్లు ఈ కేవైసీ చేయించుకోవాలి

అత్తిలి: ఈకేవైసీ చేయించుకోని రిటైర్డు ఉద్యోగులు వెంటనే ఆధార్ కేంద్రానికి వెళ్లి తమ ఫోన్ నంబర్‌కు ఆధార్‌కార్డుకు లింక్ చేయించుకోవాలని రిటైర్డు ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పమ్మి గోపాలకృష్ణమూర్తి తెలిపారు. ఆధార్‌కు ఫోన్‌నంబర్ లింక్ చేయించిన వెంటనే ఈ కేవైసీ చేయించుకోవాలని తెలిపారు.

